తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నారరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
శుక్రవారం
21 నవంబర్ 2025
సంపుటి 94
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00
Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని

# దేశమంతా విస్తరించాలి

**- సీఎం రేవంత్ రెడ్డి**



- సన్నబియ్యం పంపిణీ వల్ల పీడీఎస్ బియ్యం రీ-సైక్లింగ్ తగ్గింది
- ధాన్యం సేకరణ లక్ష్యాన్ని80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలి.
- బాయిల్డ్ రైస్ అదనపు కోటాను కేటాయించాలి
- కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తో భేటీలో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందని, ఈ సంక్షేమ పథకాన్ని దేశమంతా విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కి సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఈ పథకం గురించి వివరించారు. సన్నబియ్యం పంపిణీ వల్ల పీడీఎస్ బియ్యం రీ-సైక్లింగ్ తగ్గిందని, బహిరంగ మార్కెట్లోనూ ధరలు స్థిరపడ్డాయని చెప్పారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని అన్నారు. సమగ్రమైన అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి అన్నారు. హైదరాబాద్ వచ్చిన మంత్రి ప్రహ్లాద్ జోషి తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సివిల్ సప్లయిస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్టీఫెన్ రవీంద్ర, సీనియర్



అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని ముఖ్యమంత్రి పలు అంశాలను ప్రస్తావించారు. "2024 - 25 రబీ సీజన్ కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా...

2

## కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి

- ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ విచారణకు గవర్నర్ ఆమోదం
- ప్రభుత్వం పంపిన దస్త్రంపై సంతకం చేసిన గవర్నర్
- త్వరలో కేటీఆర్‌పై అభియోగాలు నమోదు చేయనున్న ఏసీబీ



తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం పంపిన ఫైలుపై ఆయన సంతకం చేస్తూ, కేటీఆర్‌పై విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతి లభించడంతో కేటీఆర్‌పై అభియోగాలు నమోదు చేసి, విచారణ చేపట్టేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఆయనకు నోటీసులు జారీ చేసి, విచారణ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది. విచారణ అనంతరం ఈ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఏసీబీ భావిస్తోంది. ఈ పరిణామంతో బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. మరోవైపు, ఇదే కేసులో కీలక నిందితుడిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌పై విచారణకు కూడా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఆయనపై అభియోగాలు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ)కు లేఖ రాసింది. కేంద్రం నుంచి అనుమతి రాగానే అరవింద్ కుమార్‌పైనా ఏసీబీ అభియోగాలు నమోదు చేయనుంది.

## బండి సంజయ్, కేటీఆర్‌లకు హైకోర్టులో భారీ ఊరట

- ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్‌పై కమలాపూర్ పీఎస్‌లో కేసు నమోదు
- కేసును కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు
- కోడ్ ఉల్లంఘించిన అంశంలో కేటీఆర్‌పై నమోదైన కేసు కొట్టివేసిన హైకోర్టు



తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు తెలంగాణ రాష్ట్రహైకోర్టులో ఊరట లభించింది. వారిపై నమోదైన కేసులను న్యాయస్థానం కొట్టివేసింది. 2023లో పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్‌పై కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలతో కేటీఆర్, గోరటి వెంకన్నలపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజకీయ కక్షల కారణంగానే కేంద్ర మంత్రిపై కేసు నమోదు చేశారని బండి సంజయ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు, దర్యాప్తులో పూర్తి వివరాలు లేవని పేర్కొన్న హైకోర్టు, ఈ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలతో కేటీఆర్, గోరటి వెంకన్నలపై కేసు నమోదైంది. ప్రభుత్వ పథకాల గురించి గోరటి వెంకన్న సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద కేటీఆర్‌ను ఇంటర్వ్యూ చేశారని, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని పోలీసులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లబ్ధి చేకూర్చే విధంగా ఇంటర్వ్యూ ఉందని ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచారు. అయితే రాజకీయ లబ్ధి కోసం ఈ కేసు నమోదు చేశారని కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం వారిపై నమోదైన కేసును కొట్టివేసింది.

## కేంద్రంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఫైర్

- కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా చట్టాలు తేవడంపై అసహనం
- పార్లమెంట్ కు ఆ అధికారం లేదన్న చీఫ్ జస్టిస్
- ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టాన్ని తప్పుబట్టిన సీజేఐ

తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. కోర్టు తీర్పులను పక్కనబెట్టే అధికారం పార్లమెంట్ కు లేదని పేర్కొంది. ఈమేరకు 2021 లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ ట్రైబ్యునల్‌తో పాటు పలు ట్రైబ్యునళ్లు రద్దయ్యాయని మద్రాస్ బార్ అసోసియేషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.



ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టం అమలును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో న్యాయస్థానం కొట్టివేసిన చట్టాలకు.. వాటి నిబంధనల్లో స్వల్ప మార్పులు చేసి కొత్త చట్టాలు తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కోరగా.. సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు ప్రాధాన్యతను బట్టి అవసరమైతే తావే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తామని చెప్పారు. దీంతో ప్రభుత్వ న్యాయవాది విచారణకు వాయిదా కోరగా సీజేఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ పొందే వరకూ ఈ కేసులో తీర్పు రావద్దని కోరుకుంటున్నారా?' అంటూ ప్రభుత్వ న్యాయవాదిని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం కోర్టు తీర్పులను ఉల్లంఘించడం సరికాదని పేర్కొంటూ.. ట్రైబ్యునళ్ల సంస్కరణ 2021 చట్టంలోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీర్పు వెలువరించారు.

## ఒకేసారి 130 మందికి ప్రమోషన్లు..

**- రేవంత్ సర్కార్ కీలక ఉత్తర్వులు**

- పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు
- ఏడేళ్ల తర్వాత కార్యదర్శులకు సూపరింటెండెంట్లుగా ప్రమోషన్
- ఒకేసారి 130 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల హర్షం
- ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని వినతి



వివరాలు 2 లో..

## శబరిమల రద్దీ వెనుక రాజకీయ కుట్ర?

**- కేరళ మంత్రి సంచలన ఆరోపణ**

- శబరిమలలో భారీగా పోటెత్తిన భక్తులు
- అయ్యప్ప దర్శనానికి 12 గంటలకు పైగా నిరీక్షణ
- రోజుకు 75 వేల మందికే దర్శనం అంటూ పరిమితి
- అధికారుల వైఫల్యంపై కేరళ హైకోర్టు తీవ్ర అసంతృప్తి

తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : కేరళలోని ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగడంతో, స్వామివారి దర్శనానికి దాదాపు 12 గంటల సమయం పడుతోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ప్రస్తుతం నిమిషానికి 65 మంది భక్తులు పవిత్రమైన 18 మెట్లు ఎక్కుతున్నారు. మండల-మకరవిళక్కు సీజన్ ప్రారంభమైన రెండో రోజే లక్ష మందికి పైగా భక్తులు తరలిరావడంతో యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా



కనిపించింది. కిలోమీటర్ల మేర బారులు తీరిన భక్తులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి ప్రదేశాల కొరతపై ...

2

## బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతి, గవర్నర్లకు కాలపరిమితి లేదు

**- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు**

- గవర్నర్లు, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదంపై కాలపరిమితి విధించలేం
- అనవసర జాప్యం చేస్తే న్యాయ స్థానాలు జోక్యం చేసుకోవచ్చు
- 'డీమ్డ్ అసెంట్' అనే భావన రాజ్యాంగ విరుద్ధమని స్పష్టీకరణ
- ఆమోదం నిరాకరిస్తే బిల్లును అసెంబ్లీకి తిరిగి పంపాల్సిందే
- సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు




తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపేందుకు ఎలాంటి కాలపరిమితి నిర్దేశించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, బిల్లుల ఆమోదంలో గవర్నర్లు అనవసరంగా, అంతులేని జాప్యం చేస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని, నిర్ణీత సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించవచ్చని తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 ప్రకారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన రిఫరెన్స్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం తన అభిప్రాయాన్ని వెల్లడించింది. గవర్నర్ నిర్ణయం తీసుకోకపోతే, కోర్టులే బిల్లుకు ఆమోదం తెలిపినట్లుగా భావించే "డీమ్డ్ అసెంట్" అనే భావన రాజ్యాంగ స్ఫూర్తికి, అధికారాల విభజన సిద్ధాంతానికి విరుద్ధమని ధర్మాసనం పేర్కొంది. ఇది న్యాయవ్యవస్థ కార్యనిర్వాహక విధులను స్వీకరించినట్లే ...

2

# శబరిమల రద్దీ వెనుక రాజకీయ కుట్ర? - కేరళ మంత్రి సంచలన ఆరోపణ

మొదటిపేజీ తరువాయి..
తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం కూడా స్పాట్ బుకింగ్ ద్వారా అనుమతించిన దానికంటే నాలుగు రెట్లు అధికంగా దాదాపు 20,000 మంది రావడంతో పరిస్థితి మరింత దిగజారింది. భక్తుల రద్దీ, అధికారుల వైఫల్యంపై కేరళ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం ఆరు నెలల ముందు నుంచే ఎందుకు ప్రణాళికలు సిద్ధం చేయలేదని అధికారులను ప్రశ్నించింది. ఇకపై రోజుకు 75 వేల మంది భక్తులకు మాత్రమే దర్శనం కల్పించాలని ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డును ఆదేశించింది. సోమవారం వరకు స్పాట్ బుకింగ్‌ను 5,000కు పరిమితం చేయాలని, వర్చ్యువల్ క్యూ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఈ రద్దీ వెనుక రాజకీయ కుట్ర ఉందని కేరళకు చెందిన ఓ మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల వేళ గందరగోళం సృష్టించేందుకు కొందరు కావాలనే పర్యవేక్షణ లేని మార్గాల ద్వారా భక్తులను పంపించి ఈ పరిస్థితిని సృష్టించారని ఆయన ఆరోపించడం సంచలనం రేపుతోంది. ప్రస్తుతం దేవస్వోమ్ బోర్డు దిద్దుబాటు చర్యలు చేపడుతుండగా, పరిస్థితిని నిశితంగా గమనిస్తామని హైకోర్టు హెచ్చరించింది.

# రిజర్వేషన్లు 50 శాతం మించకుండా.. ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక





తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక నివేదికను సమర్పించింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చడానికి ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా నివేదిక సమర్పించింది. డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24వ తేదీలోపు ఎన్నికల తేదీలను ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో అదే రోజున విచారణ జరపనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ నెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. తెలంగాణ వ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో డిసెంబర్ 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది.

# కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు స్పీకర్ ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు

- తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్న స్పీకర్
- ఈరోజుతో 8 మంది ఎమ్మెల్యేల పిటిషన్లపై పూర్తి కానున్న విచారణ
- ఈ నేపథ్యంలో ఇద్దరికి మరోసారి నోటీసులు జారీ చేసిన స్పీకర్





తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : ఫిరాయింపు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై వివరణ కోరుతూ ఆయన ఈ నోటీసులు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేయగా, సమాధానం ఇచ్చిన 8 మందిపై విచారణ కొనసాగుతోంది. దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని కోరారు. ఈ రోజుతో 8 మంది ఎమ్మెల్యేలకు చెందిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో సభాపతి వారిద్దరికి మరోసారి నోటీసులు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని అందులో పేర్కొన్నారు. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయ సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత సభాపతి నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

# రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని దేశమంతా విస్తరించాలి - సీఎం రేవంత్ రెడ్డి



మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : పెంచాలి. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ. 1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలి. పీఎంజీకేఏవై అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 343.27 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలి. 2024 - 25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలి, ఎఫ్ సీఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ రేక్ లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్రం సాయం అందించాలి, 2025-26 ఖరీఫ్ లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలి" అని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. అలాగే దేశ వ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందని, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించాలని సలహా ఇచ్చారు. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని, బాయిల్డ్ రైస్ అదనపు కోటాను కేటాయించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రా రైస్ కు అనువైన రకాల వరి సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

# ఒకేసారి 130 మందికి ప్రమోషన్లు..

## - రేవంత్ సర్కార్ కీలక ఉత్తర్వులు

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైల్‌కు మోక్షం కల్పిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో సుమారు 140 మందికి పైగా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలోని గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు. 2018 కంటే ముందు ప్రమోషన్ పొందిన వారికి 10 శాతం కోటా కింద ఇప్పుడు సూపరింటెండెంట్లుగా అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలోని రెండు మల్టీ జోన్ల పరిధిలో అర్హులైన 9 మందికి పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (పీఆర్, ఆర్డీ) శాఖ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 130 మందికి పైగా సీనియర్ అసిస్టెంట్లకు ఒకేసారి సూపరింటెండెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత మంత్రులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పీఆర్, ఆర్డీ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు.

# బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతి, గవర్నర్లకు కాలపరిమితి లేదు - సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు



మొదటిపేజీ తరువాయి.. అవుతుందని అభిప్రాయపడింది.

అదే సమయంలో, ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ ఒక బిల్లుకు ఆమోదం నిరాకరిస్తే, దానిని తప్పనిసరిగా అసెంబ్లీకి తిరిగి పంపాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా చేయకుండా తన వద్దే అట్టిపెట్టుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. గవర్నర్ల విచక్షణాధికారాల వినియోగంపై న్యాయసమీక్ష చేయలేనప్పటికీ, వారు సుదీర్ఘకాలం పాటు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉంటే మాత్రం కోర్టులు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది.

గవర్నర్లకు కాలపరిమితి విధించడంపై గతంలో తమిళనాడు గవర్నర్ కేసులో ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్రపతి ఈ రిఫరెన్స్ చేశారు. దీనిపై పది రోజుల పాటు విచారణ జరిపిన ధర్మాసనం, ఈ మేరకు స్పష్టతనిచ్చినట్లు లైవ్‌లా తన కథనంలో పేర్కొంది. ఈ తీర్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తరచూ తలెత్తుతున్న ఈ వివాదానికి తెరపడినట్లయింది.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరి మేం ఇక్కడ అరెస్టులు చేయడం లేదు - కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- తెలంగాణలో ఇక కేసీఆర్ అనేది గతం అన్న కోమటిరెడ్డి
- తెలంగాణలో భవిష్యత్తు కాంగ్రెస్‌దే అన్న కోమటిరెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం సీట్లు గెలుచుకుంటామని ధీమా
- తాము కక్ష సాధింపు చర్యలకు పాల్పడబోమని స్పష్టీకరణ



తరంగాలు, డెస్క్, నవంబర్ 20 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరి తాము ఇక్కడ అరెస్టులు చేయడం లేదని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో ఇకపై కేసీఆర్ అనేది గతమని ఆయన అన్నారు. ఆయన శకం ముగిసిందని, భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని, ఈ విషయం ప్రజలకు అర్థమైంది కాబట్టే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఆమోదం తెలిపిన విషయంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, తాము ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడబోమని స్పష్టం చేశారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రతిపక్షమంతా ఎప్పుడో జైలులో ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో రాజకీయ జోక్యం లేదని అన్నారు. చట్ట ప్రకారమే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షల నేతల విచారణలో తమ ప్రమేయం ఉండదని తేల్చి చెప్పారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఎగరాలి

- అగ్రవర్ణాల నాయకుల రాజకీయ సమాధులు కట్టాలి
- రాబోయే రోజుల్లో బిసిలు ఏకం కావాలి
- ఉమ్మడి వరంగల్ ఇంచార్జ్ పల్లబోయిన అశోక్ ముదిరాజ్



జనగామ ప్రతినిధి, నవంబర్ 20,తరంగాలు : స్థానిక సంస్థ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఎగరవేయాలని ఉమ్మడి వరంగల్ ఇంచార్జ్ పల్లబోయిన అశోక్ ముదిరాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ని కమిటీ హల్ లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షులు చెరుకూరి మౌనిక, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్ ముదిరాజ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టిఆర్పి పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి పల్లబోయిన అశోక్ ముదిరాజ్ హాజరై మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి కార్యకర్త భాగసా-్వములు కావాలి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన బీసీల రాజ్యాధికార పార్టీ పవర్ ఏంటో చూపిద్దామని అని అన్నారు.నాయకులు,కార్యకర్తలు నిబద్ధత , అంకిత భావంతో పనిచేసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలిని పిలుపునిచ్చారు. అదేవిదంగా గ్రామ, మండల, నియోజకవర్గ-స్థాయి అన్ని కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ సింగారం రవీందర్, టీఆర్పీ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జీ కాసోజు బ్రహ్మాచారి,మంద దిలీప్, గడ్డం కృష్ణ,జీట్టబోయిన నరేష్, బొప్పరి సతీష్, చిర్ర వీరస్వామి, దాసరి సంధ్యారాణి, చిలుకనీ, మహేందర్,ముక్క విష్ణు, వల్లల భానుచందర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలలు భయాన్ని వీడి ప్రశ్నించడం నేర్చుకోవాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద








వరంగల్ ప్రతినిధి, 20 నవంబర్, తరంగాలు : బాలలు భయాన్ని వీడి ప్రశ్నించడం నేర్చుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ యూనిట్, డాన్బాస్కో ఎన్.జీ.ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకథాన్ ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కాశీబుగ్గ నుండి ఓ సిటీ గ్రౌండ్స్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పాఠశాలలు, బాలల సంరక్షణ సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం ఓ సిటీ గ్రౌండ్స్ లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి నుండి బయట పడాలంటే వారి భయాన్ని వదిలి గొంతెత్తి ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అంతేకాక ప్రతీ పిల్లవాడు ఆరోగ్య కరమైన, ఆహ్లాద కరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. బాలలు వారి హక్కుల పట్ల అవగాహన కలిగి ఉంటూనే బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పాఠశాలల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు అందుబాటులో ఉన్న పిర్యాదుల పెట్టెలను ఉపయోగించు కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మాట్లాడుతూ బాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా బాలల సంరక్షణ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు పనిచేస్తున్నాయని, అత్యవసర సహాయం కోసం 1098 కు ఫోన్ చేసి సంప్రదించి వారి సమస్యలకు పరిష్కారాన్ని పొందాలని కోరారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబర్చిన వారికి కలెక్టర్, ఆదనపు కలెక్టర్ లు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సాంబశివరావు, జిల్లా యువజన, క్రీడాల అధికారి అనిల్, జిల్లా బాలల సంక్షేమ అధికారి ఉమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వసుధ, సభ్యులు మధు, షాహెదా, సుజాత, మండల విద్యా అధికారి వెంకటేశ్వర రావు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ కల్పన,డాన్బాస్కో ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ సంతోష్, షేర్ ఎన్. జీ. ఓ కోఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 20, తరంగాలు : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి,పంచాయతీ రాజ్ డైరెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పంచాయతీ అధికారులతో సర్పంచ్ ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈ ఈ ఈ పి సి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ విడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా డాక్టర్ సత్య శారద,డి సిపి అంకిత్ కుమార్,అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, జెడ్పి సీఈఓ ఇంచార్జ్ డి ఆర్ డి ఓరాంరెడ్డి, డియార్వో విజయ లక్ష్మి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణి, డిపిఓ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# 80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం పంపిణి

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి








నల్గొండ ఆర్సీ, నవంబర్ 20, తరంగాలు : ఆహార భద్రతలో భాగంగా దేశంలోని 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రతినెల 5 కిలోల ఉచిత బియ్యాన్ని ఇస్తున్నట్లు కేంద్ర ఆహార, పౌ-రసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.గురువారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ కోవిడ్ మహా విపత్తులో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదన్న ఉద్దేశంతో ఆహార భద్రత కింద పేదలందరికి 5 కిలోల చొప్పున 80 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నామని ,ఇది 2030 వరకు ఇది కొనసాగించాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించినట్లు తెలిపారు. ప్రపంచంలో ఏ దేశంలో ఇంత పెద్ద మొత్తంలో పేదలకు ప్రతినెల 5 కిలోల బియ్యం ఇవ్వటం లేదని అన్నారు. ఆస్ట్రేలియా,జర్మనీ యూరోపియన్ దేశాలలో సైతం ఇలాంటి పద్ధతి లేదని, భారత ప్రజా పంపిణీ వ్యవస్థను చూసి ఇతర దేశాలు ఆశ్చర్యపోతున్నాయని, ప్రపంచంలోనే భారత ఆహార భద్రత పథకం మోడల్ గా తీసుకురావడం జరిగిందని ఆయన వెల్లడించారు. ప్రపంచ బ్యాంకు సైతం ఇటీవల నివేదికలో భారత దేశంలో అత్యంత ఎక్కువ మందికి ఆహార భద్రత కింద ఉచిత ఆహారం పంపిణీ చేస్తున్న విషయాన్ని పేర్కొన్నట్లు వెల్లడించారు.ధాన్యం సేకరణ పై కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యాప్తంగా రెండు కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నామని, ప్రస్తుతం 915 లక్షల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యం దేశంలో ఉందని, తెలంగాణతో కలిపి 2023- 24 సంవత్సరంలో 2.25 లక్షల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలలో జమ చేసిందని తెలిపారు. ప్రతినెల తెలంగాణకు 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను కేటాయిస్తున్నామని, 1 లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, 3370 మెట్రిక్ టన్నుల గోధుమలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆహార భద్రత వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్ కార్డులన్నిటిని డిజిటలైట్ చేయడం జరిగిందని తెలిపారు. నల్గొండ జిల్లా ధాన్యం ఉత్పత్తి, ధాన్యం సేకరణలో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, ప్రస్తుతం నూతనంగా ప్రారంభించిన ఎఫ్ సి ఐ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాంలో 62 వేల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యం ఉందని, ప్రభుత్వం భూమి ఇస్తే మరో ఎఫ్సిఐ గోదామును నల్గొండ జిల్లాలో ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. 2014 -15 నుండి తెలంగాణలో ధాన్యం సేకరణను 600శాతం పెంచినట్లు చెప్పారు . ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ద్రవ్యవల్బణంతో బాధపడుతున్నాయని, ఇండియాలో కేవలం .25 శాతం మాత్రమే ఉందని, పి యం సూర్య ఘర్ ముక్త్ బిజిలి పథకం కింద 20175 ఇండ్లకు 20 వేల కోట్లరాయితీ తో పథకాన్ని అమలు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు వరి వైపే కాకుండా ఆయిల్ సీడ్స్ ,వాణిజ్య పంటలు పండించాలని కోరారు. కోవిడ్ సమయంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి తెలంగాణకు రావాల్సిన సబ్సిడీ 343 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. అలాగే సిఎంఆర్ డెలివరీకి సంబంధించి 10 సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న 1400 కోట్ల రూపాయల మంజూరుకు సరైన రికార్డులు సమర్పిస్తే పరిశీలించి వాటిని కూడా మంజూరు చేస్తామని తెలిపారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి 2024- 25 సంవత్సరానికి సంబంధించి బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పెంచాలని, పదేళ్ల నుండి పెండింగ్లో ఉన్న 1400 కోట్ల రూపాయలను సీఎంఆర్ బకాయిలు చెల్లించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి సబ్సిడీ 343 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని, 2024- 25 ఖరీఫ్ సీఎంఆర్ డెలివరీ కాలపరిమితిని 60 రోజులు పెంచాలని, 24 -25 సంబంధించి యసంగి 120 రోజులకు పెంచాలని, తెలంగాణకు అదనపు రేక్ ల సౌకర్యాన్ని కల్పించాలని, దీనివల్ల రైసు మూమెంట్ కు సులభం అవుతుందని, 2025- 26 కు సంబంధించి ధాన్యం సేకరణ టార్గెట్ ను 80 లక్షల మెట్రిక్ టన్నుల నుండి పెంచాలని, ప్రస్తుత ఎఫ్సిఐ గోదాంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం వరకు పెంచాలని కోరారు.దేశంలో తెలంగాణ ఖరీఫ్లో 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిందని, 80 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నదని, ఇదివరకే 29 వేల కోట్ల రూపాయలను ధాన్యం కొనుగోలుపై ఖర్చు చేయడం జరిగిందని ,రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో 8800 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఆహార భద్రత కింద ప్రతి ఒక్కరికి 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఇస్తున్నామని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లా బత్తాయి పంటకు ప్రసిద్ధి చెందిందని, అందువల్ల జిల్లాలో 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బత్తాయి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని, ధాన్యానికి సంబంధించి ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్యంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదామును మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి ,భారత ఆహార సంస్థ ఈ డి వనిత శర్మ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, భారత ఆహార సంస్థ జిల్లా మేనేజర్ రాజు, ఎఫ్సిఐ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ సీనియర్ కార్యకర్తకు వాక్ ఫౌండేషన్ చేయూత

- వైద్య చికిత్స నిమిత్తం వాక్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ వన్నాల వెంకట రమణ

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 20, తరంగాలు : బీజేపీ సీనియర్ కార్యకర్తకు వాక్ ఫౌండేషన్ ద్వారా చేయూత అందించి వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ అండగా నిలిచారు. వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ బీజేపీ నాయకురాలు బండి సుజాత భర్త బండి నగేష్ కు ఇటీవల కాలుకి శస్త్ర చికిత్స జరిగి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ వారి ఇంటికి వెళ్లి బండి నగేష్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి వైద్య ఖర్చుల నిమిత్తం వాక్ ఫౌండేషన్ ద్వారా 12వెల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాక్ సమైక్య ఫౌండేషన్ ద్వారా గత 16 సంవత్సరాల నుండి పేదల సహాయం కొరకు స్థాపించి, సుమారు 600 పై చిలుక కుటుంబాలకు వర్ధన్నపేట నియోజకవర్గం లోని పలు గ్రామాలలో నెలకు 10 కిలోల ఉచిత బియ్యం, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వారి కంటి చూపు కొరకు ఆపరేషన్లు చేయించడం జరిగింది. అంతేకాకుండా తల్లిదండ్రులను కోల్పోయిన అనాధ పిల్లలు, పేద పిల్లలు చదువుల కొరకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ,అనారోగ్యం తో ఉన్న పేదవారికి వారి చికిత్స కొరకు ఆర్థిక సహాయం వంటి ఎన్నో





కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.వారి వెంట బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్, కాశీబుగ్గ మండల అధ్యక్షులు అపురూప రజనిష్ నేత , ఇతర బీజేపీ నాయకులు కొంతం సందీప్ , తమ్మిశెట్టి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 20,తరంగాలు : 2002 సంవత్సరంలో నమోదైన ఓటర్ల జాబితాను ప్రస్తుతం ( 2025) ఉన్న ఓటర్లతో పాటు వారి సంతానంలో ఉన్న ఓటర్లను స్పెషల్ ఎంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ )లో సరిపోల్చడం జరుగుతుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీవోలు/ ఈఆర్వోలు, అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్లను నమోదు చేయడం, చనిపోయిన ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడం, ఓటర్ల జాబితాలో ఓటర్ల వ్యక్తిగత వివరాల్లో అవసరమైన సవరణలు చేయడం జరుగుతుందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సజావుగా సాగాలంటే బూత్ లెవెల్ అధికారులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించే బూత్ లెవెల్ ఏజెంట్ల ఆవశ్యకత ఉందన్నారు.




బూత్ లెవెల్ ఏజెంట్ల నిర్ణీత జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ రామీ రెడ్డి, డిపిఓ కల్పన, ఎలక్షన్ డిటి రంజిత్ కుమార్, వివిధ పొలిటికల్ పార్టీల ప్రతినిధులు, కాంగ్రెస్ తక్కల్లపల్లి రవీందర్ రావు , టిడిపి కె శ్యామ్, బిజెపి బి హరి శంకర్, వైఎస్ఆర్సిపి ఎన్ రజినీకాంత్, డీఎస్పీ జే అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వల మోడల్ స్కూల్లో విద్యార్థుల ధర్నా..

- మెను ప్రకారం భోజనం అందించాలి
- కేర్ టేకర్ ను సస్పెండ్ చేయాలని విద్యార్థుల డిమాండ్

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.20, తరంగాలు : మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని విద్యార్థుల ధర్నా చేపట్టిన సంఘటన చోటుచేసుకుంది. మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్లో భోజనం సరిగా లేదని , గత మూడు రోజులుగా కలవల మోడల్ స్కూల్ హాస్టల్ లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వాల్సి ఉండగా కేర్ టేకర్ నిర్లక్ష్య వైఖరి వలన సరైన సమయానికి ఇవ్వకపోవడంతో పసులతోనే చదువులకు వెళ్తున్నామని, ఈ నేపథ్యంలో బుధవారం సైతం ఉదయం ఇవ్వాల్సిన అల్పాహారం విద్యార్థులకు ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విషయాన్ని తెలుసుకున్న స్థానిక తాసిల్దార్ వివేక్ మోడల్ స్కూల్ హాస్టల్ లో సందర్శించి ఆందోళన విరమింప చేయాలని తెలిపారు. గురువారం సైతం ఉదయం ఇవ్వాల్సిన అల్పాహారం విద్యార్థులకు ఇవ్వకపోవడంతో మళ్లీ విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ విషయంపై జిసిడివో విజయ్ కుమారి, తహసిల్దార్ వివేక్, ఎస్సై క్రాంతి కిరణ్, ఎంపీడీవో క్రాంతి, ఎంఈఓ యాదగిరి స్వయంగా విద్యార్థులతో ముచ్చటించి హాస్టల్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్లో ఉన్న విద్యార్థులకు సరైన సమయానికి భోజనం పెట్టడం లేదని, కేర్ టేకర్ వార్డెన్ నిర్లక్ష్య వైఖరి వలన మేము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సరైన సమయానికి వంట నిర్వాహకులు రావడంలేదని సమయానికి మెనూ ప్రకారం భోజనాన్ని అందించడం లేదని వాచ్మెన్, ఏఎన్ఎం సైతం సమయపాలన పాటించడం లేదని, నిర్వాహకులను మార్చాలని అధికారులకు విన్నవించారు. ఈ మేరకు అధికారులు మాట్లాడుతూ ఇలాంటి సమస్యలను పునరావతం కాకుండా చూస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని పాత టీం ను తొలగించి కొత్త టీం ను ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పరిమి నవీన్, ఆర్ఐ మజీద్ ,హాస్టల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







# అర్ధనారీశ్వరుడికి అన్న పూజ..

- అమావాస్య సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.20, తరంగాలు : కేసముద్రం మున్సిపాలిటీ రామాలయంలో కార్తీక మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా శివునికి రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం, అన్నాభిషేకం (అన్నపూజ) ప్రత్యేక అలంకరణ ఆలయ అర్చకులు రాజేష్ శర్మ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబటి మహేందర్ రెడ్డి, మదూరి రమేష్, ఓలం మురళి, పొదిలనరసింహారెడ్డి, కొయ్యగూరి యాకూబ్ రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్లు, కొప్పుల శంకర్ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



# ఎస్ జి ఎఫ్ అండర్ 17 నెట్ బాల్ ఆటలపోటీలకు ఎంపికైన శ్రీ వివేకవర్ధిని విద్యార్థులు



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 20, తరంగాలు : నెల్లికుదురు లో8-11-2025న జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీలలో నెట్ బాల్ అండర్ 17 పోటీలలో భాగంగా శ్రీ వివేకవర్ధిని పాఠశాల నుండి గద్దల సాత్విక్ హర్ష, రేసు చరణ్, గుగులోత్ ఐశ్వర్య, కందనూరి విరోనిక, బానోత్ హాసిని మరియు జాటోత్ రాజేశ్వరి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు. వీరు 21-11-2025 నుండి 23-11-2025 వరకు నల్గొండ జిల్లాలోని హాలియాలో జరగబోయే 69 వ అండర్ 17 నెట్ బాల్ పోటీలకు హాజరవుతారు. ఈ సందర్భంగా పాఠశాల పిఈటి డెక్క లక్ష్మణ్ సార్ మరియు విద్యార్థులను అభినందించడం జరిగింది.

# చెకుముకి మండల స్థాయి పరీక్ష





కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి,నవంబర్.20, తరంగాలు : కేసముద్రం మండలంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కేసముద్రం స్టేషన్ జడ్పీ ఎస్ ఎస్ హైస్కూల్లో మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిర్రా యాకాంతం గౌడ్, బండారు నరేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8,9,10 తరగతిల నుంచి ఒకరు చొప్పున ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి మండల స్థాయికి పంపించాలని వారు కోరారు.

# గ్రామీణ శిశు అభివృద్ధికి అంగన్వాడీలే పునాది

- అంగన్వాడి టీచర్లకు అవగాహన సదస్సు





నల్లబెల్లి, నవంబర్ 20 : తరంగాలు : అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ శిశు అభివృద్ధికి పునాది వంటివని తాసిల్దార్ ముప్పు కృష్ణ, నర్సంపేట సిడిపిఓ మధురిమ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గడ్డం సుభద్ర ఆధ్వర్యంలో నల్లబెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ శిశు ఆరోగ్యం, పోషణ, టీకా కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, మహిళలపై హింస వంటి సమస్యలను గుర్తించి ప్రజల్లో అవగాహన కల్పించడంలో అంగన్వాడీ టీచర్లు ముందుండాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, టీకాలు, గర్భిణీల సేవల్లో అంగన్వాడీ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి విజయ్ కుమార్, ఎంపీడీవో శుభనివాస్, ఎస్సైలు గోవర్ధన్, వెంకటరెడ్డి, ఎంఈఓ అనురాధ, ఏవో రజిత, నల్లబెల్లి, మేడేపల్లి వైద్యాధికారులు ఆచార్య, జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ప్రతీ మహిళకు చీరలు పంపిణీ చేయాలి

## - నామాల సత్యనారాయణ డిమాండ్



నర్సంపేట నవంబర్ 20 తరంగాలు : రాష్ట్రంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు ఎలాంటి ఆంక్షలు లేకుండా చీరలు పంపిణీ చేయాలని బి ఆర్ ఎస్ మండల ఇన్చార్జి నామాల సత్యనారాయణ మరియు మండల పార్టీ ఇన్చార్జి కోమాండ్ల గోపాల్ రెడ్డి లు డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేట పట్టణంలో మండల పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది ఈ సందర్భంగా సత్యనారాయణ గోపాల్ రెడ్డి లు మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేశారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మహిళా సంఘాలలో ఉన్న సభ్యులకు మాత్రమే ఇస్తామని చెప్పి చాలామంది మహిళలకు చీరలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పథకం అమలు చేయలేని దుస్థితిలో ఉందని మొక్కుబడిగా కొంతమందికే పథకాలు అమలు చేస్తూ మామ అనిపించుకుంటున్నారని ఎద్దేవా చేశారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నరసింహా రాములు మోతే పద్మనాభరెడ్డి బండారి రమేష్ మోటూరి రవి కొడారి రవి భూక్య వీరన్న రవి పెద్ది శ్రీనివాసరెడ్డి జాటోతు భీమ్లా నాయక్ తో పాటు తదితరులు ఉన్నారు.

# ఈనెల 28, 29న మరిపెడలో జరిగే సీఐటీయూ జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయండి

## - సిఐటియు మండల కార్యదర్శి, జల్లే జయరాజు



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.20, తరంగాలు : గురువారం రోజున కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మున్సిపాలిటీ కార్మికుల సమావేశం యాకయ్య అధ్యక్షతన నిర్వహించడమైనది. ఈ సమావేశానికి సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కార్మికులు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడులు తెచ్చి కార్మిక రంగాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా కుట్రలు చేస్తుందని, బడా పెట్టుబడిదారీ కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలను అమలు చేస్తూ 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోచుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం శ్రమశక్తి 2025 పేరుతో తెచ్చిన నూతన లేబర్ పాలసీ కార్మికులను బానిసలుగా మార్చేందుకే తెచ్చిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకమైన చట్టాలను వెనక్కి తీసుకోవాలని అన్నారు.నిరంతరం కార్మికులకు అండగా కార్మికుల పక్షాన పోరాటలు నిర్వహిస్తూ వారి హక్కులను పరిరక్షించడంలో ముందంజలో ఉంటున్న సిఐటియు మహబూబాబాద్ జిల్లా మహాసభలు మరిపెడ మున్సిపాల్టి కేంద్రంలో ఈనెల 28, 29 తారీకులలో జరుగుతున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి వీరన్న కే యాకయ్య ప్రమోద్ వీరన్న ఎస్ వెంకన్న జి యాకయ్య టి వెంకన్న డి కృష్ణ కనక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు

- కలకొండ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లో వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించిన
- జననీ ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి వెంకటయ్య గౌడ్





కల్వకుర్తి, నవంబర్ 20, తరంగాలు ప్రతినిధి : జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలకొండ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లో వాటర్ ఫిల్టర్ ను జననీ ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి వెంకటయ్య గౌడ్ ప్రారంభించారు. మాడుగుల మండలం కలకొండ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ లో మంచినీటి సౌకర్యం లేక నానా ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థుల కోసం స్కూల్ హెచ్.ఎం. జనని ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి వెంకటయ్య గౌడ్ ని వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయమని కోరారు. వెంటనే స్పందించిన చింతపల్లి వెంకటయ్య గౌడ్ స్కూల్ కి వెళ్లి వాటర్ రాకపోవడం పరిశీలించి విద్యార్థుల కోసం కమ్యూనిటీ పూర్ వాటర్ ఫౌండేషన్ తో ఒప్పందం చేసుకొని జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ విద్యార్థుల ప్రధాన సమస్యగా మారిన మంచినీటి కోసం ఏకంగా ఫిల్టర్ వాటర్ పైప్ లైన్ ఏర్పాటుచేసి వాటర్ ఫిల్టర్ ఒక సంవత్సరానికి 10000 ఇచ్చేటట్టు చింతపల్లి వెంకటయ్య గౌడ్ తమ జనని ఫౌండేషన్ తరపున ప్రతి సంవత్సరం ఇచ్చేటట్టు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమ్యూనిటీ ప్యూర్ వాటర్ వైస్ ప్రెసిడెంట్, జనని ఫౌండేషన్ చైర్మన్ కలకొండ గ్రామ సర్పంచ్ అభ్యర్థి చింతపల్లి వెంకటయ్య గౌడ్ వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్.పి.హెచ్.ఎస్. హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాలలో బాత్రూంలకు వాటర్ ఉండేది కాదని ఏకంగా నాలుగు బాత్రూంలు నిర్మించడం తో పాట వాటర్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.అదేవిధంగా విద్యార్థులకు,టీచర్లకు తాగే నీటి వసతి లేకపోవడంతో జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో జనని ఫౌండేషన్ తరపున వాటర్ ఫిల్టర్ ఓపెనింగ్ చేయడం జరిగిందని స్కూల్లో ఉన్న విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేయడం జరిగిందని స్కూల్ తరపున విద్యార్థిని, విద్యార్థుల తరపున జనని ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి వెంకటయ్య గౌడ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. చింతపల్లి వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ తన బిడ్డ జనని పేర ఫౌండేషన్ ఏర్పాటు చేసి జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థిని విద్యార్థుల కోసం హెచ్ఎం కోరిక మేరకు వాటర్ ఫిల్టర్ ప్రారంభించడం జరిగిందని, పాఠశాలకు ఎలాంటి అవసరం ఉన్న చేయడానికి తను సిద్ధంగా ఉంటానని ప్రతి విద్యార్థిలో తనబిడ్డ జనని చూసుకుంటున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మల్లేష్ గౌడ్. నరసింహ గౌడ్, బచ్చమోని మల్లేష్ యాదవ్,సముద్రాల వెంకటయ్య,తాండ మల్లేష్,నాయిని నగేష్, ఎండి రహీం, డొంకి సాయిలు,ఎండి జాంగిర్,బూరెల రమేష్, బూరెల సాయి గౌడ్,సబొట్ లక్ష్మణ్,కావాలి వెంకటయ్య, ఎండి హుజూర్, పున్న సతీష్, చింతపల్లి అంజయ్య,నాగిళ్ల మాసయ్య, తాండ చెన్నయ్య, మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న శంభాల చిత్రం యూనిట్






వరంగల్ ప్రతినిధి, నవంబర్ 20,తరంగాలు : శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని గురువారం ప్రముఖ తెలుగు సినీ హీరో ఆది సాయికుమార్, అర్చన తో పాటు శంభాల చిత్రం యూనిట్ సభ్యులు సందర్శించిన్నట్లు భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి,సహాయ కమీషనర్ రామల సునీత తెలిపారు. ఈ సందర్భంగా హీరో ఆది సాయికుమార్, అర్చన తో పాటు శంభాల చిత్రం యూనిట్ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్నపన మండపంలో భద్రకాళి శేషు, వేదపండితులు శంభాల చిత్రం యూనిట్ వారికి మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న తదితరులు ఉన్నారు.

# మాజీ ఎంపీపీ జక్కా అశోక్ ని పరామర్శించిన బీ ఆర్ ఎస్ నాయకులు





నర్సంపేట నవంబర్ 20 తరంగాలు : చెన్నారావుపేట మండల మాజీ ఎంపీపీ బి ఆర్ ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్కా అశోక్ తండ్రి జల్లి గ్రామ మాజీ సర్పంచ్ జక్కా కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం నర్సంపేట మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ తో పాటు మండల నాయకులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం వారి కుమారుడైన జక్కా అశోక్ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు కోమండ్ల గోపాల్ రెడ్డి ఈర్ల నరసింహా రాములు మోటూరి రవి మోతే పద్మనాభరెడ్డి పెద్ది శ్రీనివాస్ రెడ్డి వీరన్న కొడారి రవి బండారి రమేష్ తో పాటు పలువురు ఉన్నారు. నియోజకవర్గం యాదవ సంఘం నాయకులు బీసీ సంఘాల ప్రతినిధులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ మాట్లాడుతూ జక్కా కొమురయ్య మృతి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ముఖ్య నాయకులు బాలకృష్ణ బీసీ సంఘమ్ ప్రతినిధులు పిండి కుమార్ నూనె సతీష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# నివాళులు అర్పించిన రాణా ప్రతాప్



నర్సంపేట నవంబర్ 20 తరంగాలు : నర్సంపేట పట్టణ పరిధిలోని ముగ్ధంపురం గ్రామ బిజెపి నాయకులు జూలూరు వెంకటేశ్వర్లు తల్లి జూలూరు, కొమరమ్మ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి గురువారం కొమరమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్ సీనియర్ నాయకులు కోమల్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి తాళ్ల పెల్లి రాము రంజిత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టు ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షించాలి
- ఇసుక తవ్వకం,రవాణాపై కఠిన నిఘా పెట్టాలి
- అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే వెంటనే కేసులు నమోదు చేసి,వాహనాలను స్వాధీనం చేసుకోవాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



వరంగల్ ప్రతినిధి,20 నవంబర్, తరంగాలు : జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఆదేశించారు.గురువారం వరంగల్ కలెక్టరేట్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఇసుక లభ్యత, రవాణా ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి ఇసుక అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టు ఏర్పాటు చేసి నిత్యం పర్య వేక్షించాలన్నారు. జిల్లాలో ఇసుక లభ్యత ఉన్న చోట్ల నుండి ఆయా ప్రాంతాల తాహసిల్దారులు నీటిపారుదల శాఖ, భూగర్భ గనుల శాఖ అధికారులు సమన్వయం చేసుకొని ఇసుక మాఫియా పై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇసుక తవ్వకం, రవాణాపై కఠిన నిఘా పెట్టాలి. అనుమతి లేని ఇసుక తరలింపు జరుగుతున్నట్లయితే వెంటనే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవాలి. విజిలెన్స్ బృందాలను శక్తివంతం చేసి రోజువారీ తనిఖీలు నిర్వహించాలని అన్నారు ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జిల్లా భూగర్భ గనుల శాఖ ఏ డి రవి శంకర్, ఆర్డీవోలు ఉమారాణి, సుమా, తహశీల్దార్లు వెంకటస్వామి, విజయ సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ శ్రీనివాస మృతి బాధాకరం

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిజిటల్ మీడియా విలేకరులు



తొర్రూర్ నవంబర్ 20 తరంగాలు : తొర్రూర్ మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన మాచర్ల శ్రీనివాస్ గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టు వృత్తిలో ఉంటూ అందరికీ జర్నలిస్టులకు కుటుంబ సభ్యుని వలె ఉండే శ్రీనివాస్ అకాల మరణానికి తొర్రూర్ డిజిటల్ మీడియా విలేకరులు అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని,తెలియజేసినారు. శ్రీనివాస్ మృతి డిజిటల్ మీడియా విలేకరులకు తీరని లోటు అన్నారు. శ్రీనివాస్ కుటుంబానీ కి చేదోడు వాదోడుగా ఉంటామని డిజిటల్ మీడియా విలేకరులు అన్నారు. శ్రీనివాస్ మృతి తీరనిలోటని డిజిటల్ మీడియా విలేకరులు మహంకాళి వెంకటేశ్వర్లు పూర్ణ యశ్వంత్,వేర్పుల మహేష్, ధరావత్ రాజేష్ మంగళపల్లి నాగరాజు ఎండి రహీం మడిపెద్ది కార్తీక్ మహేందర్ భరత్ కుమార్ హరీష్ ఉమేష్ బషీర్ మహేందర్ యాకమల్లు రమేష్ తొర్రూర్ మండలానికి చెందిన అందరూ డిజిటల్ మీడియా విలేకరులు శ్రీనివాస్ మృతి తీరనిలోటని అతను ఏ లోకాన ఉన్న సుఖంగా ఉండాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నామని విలేకరులు మాట్లాడుతూ అన్నారు.

# ఆప్తమాలజీ యూనిట్ ప్రారంభం

నర్సంపేట నవంబర్ 20 తరంగాలు : నర్సంపేట పట్టణంలోని గ్రీన్ స్టార్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో గురువారం ఆప్తమాలజీ కంటి వైద్య యూనిట్ ను ప్రారంభించినట్లు గ్రీన్ స్టార్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి గ్రీన్ స్టార్ హాస్పటల్లో కంటి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని కంటి ఆపరేషన్లు కంటిలో పొర లెన్స్ లాంటి ఆపరేషన్లు కూడా చేయబడును అని దయాబెటిక్ పేషెంట్లకు కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించబడును అని తెలిపారు ఈ కార్యక్రమంలో కాకతీయ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ విద్య కంటి వైద్య నిపుణులు నామాల అనిల్ గ్రీన్ స్టార్ ఆసుపత్రి డైరెక్టర్లు బీరం నాగిరెడ్డి నాయుడు శ్రీనివాస్ అనంతగిరి రవి గోనే యువరాజు పి ఆర్ ఓ రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# అమ్మవారిని దర్శించుకునేందుకు వీల్ చైర్ బహుకరణ

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 20, తరంగాలు : శ్రీ భద్రకాళి అమ్మవారిని వికలాంగులు దర్శించుకునేందుకు వీల్ చైర్ బహుకరించారు. వేముల అనసూయ జ్ఞాపకార్థం వారి కుమారులు వేముల రాంచంద్రం, శ్రీనివాసులు, దేవస్థాన ధర్మకర్త కటకం రాములు సంయుక్తంగా ఒక వీల్ చైర్ ను దేవాలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, జారతి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



# వీలైన గ్రామాల కార్మికులకు వేతనాలు పెంచాలి

## - బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు

నర్సంపేట నవంబర్ 20 తరంగాలు : నర్సంపేట మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల కార్మికులకు మునిసిపాలిటీలో కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చే వేతనాలు చెల్లించాలని బి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. గురువారం తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బి ఆర్ టి యు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా గోనె యువరాజు మాట్లాడుతూ పురపాలక సంఘంలో విలీనమైన ఎనిమిది గ్రామాలు మహేశ్వరం రాముల్ నాయక్ తండ పర్శ నాయక్ తండ నాగుర్లపల్లి మాదన్నపేట ముగ్దుంపురం రాజపల్లె ముతోజిపేట గ్రామాల పరిధిలో పనిచేస్తున్న 34 మంది కారోబార్లు పంపు ఆపరేటర్లు స్వీపర్లు తదితర విభాగాలలో పనిచేస్తున్న కార్మికులను నర్సంపేట పురపాలక సంఘంలో విలీనం చేసుకొని పట్టణంలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారని అయినా వారికి గ్రామపంచాయతీలో పనిచేస్తున్నప్పుడు ఇచ్చే 9,500 వేతనం మాత్రమే ఇస్తున్నారని కాంట్రాక్టు లేబర్ కు ఇచ్చే 16600 ఇవ్వడం లేదని అన్నారు కాంట్రాక్టు కార్మికులతో సమానంగా పనిచేసినప్పుడు వీరికి ఎందుకు సమాన వేతనం ఇవ్వరని యువరాజు ప్రశ్నించారు దీనిపై యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సిడిఎంఏ కు మరియు జిల్లా కలెక్టర్ తో పాటు ఉన్నతాధికారులను కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు గడ్డం సమ్మయ్య కార్మికులు పరుశరాములు మహేందర్ శ్రీశైలం శ్రీనివాస్ కృష్ణ యాకుబ్ రమేష్ వీరన్న నాగరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# మహబూబాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్



మహబూబాబాద్, ప్రతినిధి నవంబర్20, తరంగాలు : మహబూబాబాద్ జిల్లా గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని లక్ష్మి నర్సింగ్ హెూం జీవనజ్యోతి హాస్పిటల్ ఆయూష్ హాస్పిటల్ ఆరోగ్య హాస్పిటల్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో సిజేరియన్ ప్రసవాలు ప్రైవేట్ ఆసుపత్రులలో ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించామని సిజేరియన్ చేయాల్సిన పరిస్థితులు వున్నప్పుడు మాత్రమే సిజేరియన్ ప్రసవాలు చేయాలని నిబంధనలను ఉల్లగించి ఎవరైనా చేసినట్లైతే వారి రిజిస్ట్రేషన్ కాన్సెల్ చేసేందుకు వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు స్కానింగ్ సెంటర్ల వారు ప్రతి నెల 5వ తేదీ లోపు ఫామ్ ఎఫ్ లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని సరియైన విధంగా పూర్తిచేయాలని అదేవిధంగా వాటిని ప్రతిరోజూ పి సి పి ఎన్ డి పి వెబ్సైట్లో ఆన్లైన్ చేయాల్సి ఉంటుందని స్కానింగ్ సెంటర్లలలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ మగ అని తెలుపుట చట్టరీత్యా నేరమని పేర్కొంటూ అన్ని స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసే గదిలో మరియు వేచియుండు హాలులో తప్పకుండా ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు అనే బోర్డు పెట్టాల్సిందిగా ఆదేశించారు నిబంధనలను అతిక్రమించిన వారిపై పిసిపి ఎన్డిటి చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడతాయని ఎంటిపి చట్టం ప్రకారం నమోదు చేసుకున్న ఆసుపత్రులు మాత్రమే అబార్షన్ లు చేయాలని నమోదు చేయని ఆసుపత్రుల లో గర్భవిచ్చితి చేసినట్లైతే ఎంటిపి చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడుతాయని ఆయన పేర్కొన్నారు హాస్పిటల్ మేనేజ్మెంట్ వారు అత్యావసర సేవలకి సంబంధించిన ఫోన్ నంబర్స్ ని వారు అంధించే సేవలకు తీసుకునే రుసుములకు సంబంధించిన దరల పట్టికను ఆసుపత్రులలో పనిచెయు డాక్టర్ ల వివరాలు ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పిసిపిఎన్డిటి సర్టిఫికేట్ లను కూడా అందరికీ కనిపించే విదంగా ప్రదర్శించాలని అలాగే ఫైర్ కు సంబంధించిన పరికరాలను అమర్చుకోవాలని తెలిపారు పనిచెయు సిబ్బంది యొక్క వివరాలను వారి యొక్క అర్హత సర్టిఫికెట్ ల ను ఆసుపత్రులలో వుంచాలని ఒకవేళ సిబ్బంధిని గాని డాక్టర్ లను కానీ మార్చినట్లఐతే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయమునకు అట్టి వివరములు ముందు గానే తెలియ పరచాలని బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు ఇచ్చిన సర్టిఫికెట్స్ ను రెన్యూవల్ చేయించుకోవాలని ఆయన పేరుకొన్నారు విదేశాలలో ఎంబిబిఎస్ చదువుకొని వచ్చిన వారు భారత ప్రభుత్వం వారు నిర్వహించే అర్హత పరీక్ష ఉత్తీర్ణత చెందాలని అంతేకాకుండా వారి డిగ్రీలు ఎంబిబిఎస్ కు మాత్రమే సమానమని ఎం.డి అని రాసుకోకూడధని ఒకవేళ ఎవరైనా అలా రాసి ప్రజలను తప్పుధోవ పట్టిస్తే వారిపైన క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు ఈకార్యక్రమం లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శశి జ్యోస్న ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం నోడల్ అధికారి డాక్టర్ ప్రత్యూష జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ హెల్త్ ఎడ్యుకేటర్ రాజు హెచ్ ఈ ఓ లోక్య అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ నీ మర్యాదపూర్వకంగా కలిసిన నవీన్ యాదవ్



తరంగాలు, జూబ్లీహిల్స్, నవంబర్ 20 : తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి (స్పీకర్) ని మర్యాద పూర్వకంగా కలిసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం పురోగతి..సంక్షేమ అంశాలపై చర్చించారు.. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తమ అభినందనలు తెలియజేసి ప్రజాసేవలో ఇలాగే ప్రతిష్టాత్మకంగా కొనసాగాలని ఆకాంక్షించారు..ఈ సందర్భంగా వల్లాల నవీన్ యాదవ్ . స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.. వారి ఆశీర్వాదాలు.. సూచనలు.. నాకు ప్రేరణ కలిగించాయని జూబ్లీహిల్స్ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు.

# నీటి పారుదల, నీటి వనరుల గణనపై అవగాహన



తరంగాలు న్యూస్, మద్నూర్ నవంబర్ 20 : మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం సూక్ష్మ నీటిపారుదల గణనా నీటి వనరుల గణన నమోదుపై మండల తాసిల్దార్ ఎండి.ముజీబ్ అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీటి కుంటలు, చెరువులు, వివిధ సూక్ష్మ నీటి పారుదల వనరులను లెక్కించనున్నట్లు తెలిపారు. వీటిని మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి వనరుల లభ్యత గురించి తెలియనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ముజీబ్ , ఏఎస్ఓ దత్తు, ఎన్యుమరెటర్స్ లు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా 58వ గ్రంథాలయ వారోత్సవాలు

## - ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి



మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.20, తరంగాలు : మహబూబాబాద్ జిల్లా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను పట్టణంలోని గ్రంథాలయంలోనిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు ఈ సందర్భంగా విద్యాధికారి దక్షిణామూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. ప్రజలలో సామాజిక రాజకీయ వైజ్ఞానిక చైతన్యాన్ని తీసుకురావడంలో గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుచున్నవి స్వాతంత్ర ఉద్యమంలోనే కాకుండాఅనేక ఉద్యమాలకు గ్రంథాలయాలు వేదికగా ప్రధాన పాత్ర పోషించినవి మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు పుస్తక పఠనం అనేది చాలా మెరుగైన పరిష్కార మార్గమని అన్నారు. ఓ మంచి పుస్తకం ఓ మంచి మిత్రులతో సమానం పుస్తకానికి మిత్రునికి అంతటి సాపత్యముంది సన్నిహిత్యం ఉంది సాహితీ బంధం ఉంది మంచి మిత్రుడు అన్నవాడు స్నేహితుని అపకారం తలపెట్టడు అలాగే పుస్తకం కూడా కీడు చేయదు విలువల నేర్పిస్తుంది మార్గదర్శకంగా ఉంటుంది అన్నారు విద్యార్థి దశలో చదివే పుస్తకాలే జీవితాన్ని నడిపిస్తాయని పిల్లలలో పెద్దలలో ప్రజానీకం అందరిలో పుస్తక పఠనం ఒక వ్యసనం గా మారాలని అన్నారు ఈ వారోత్సవాల సందర్భంగా మోక్షం గుండం విశ్వేశ్వరయ్య ట్రస్ట్ చైర్మన్ షేక్ జానీ 6కుర్చీలు గ్రంథాలయ పాఠకుడు సాయికిరణ్ 3 కుర్చీలు ప్రకాష్ ఎలక్ట్రికల్ వీరన్న 4కుర్చీలు గ్రంథాలయానికి వితరణ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత జిల్లా సైన్స్ అధికారి అప్పారావు మోక్షం గుండం విశ్వేశ్వరయ్య ట్రస్ట్ చైర్మన్ షేక్ జానీ రిటైర్ లైబ్రేరియన్ గూడ నరేందర్ గ్రంథ పాలకులు జి విజేందర్ సిహెచ్ రవి రుద్రారపు వీరేందర్ బొడ్డుపల్లి భూలక్ష్మి భోగి యాదమ్మ పుస్తక ప్రియుడు అబ్బ గాని భాస్కర్ జంపాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వైద్య సేవలపై అవగాహన కలిగి ఉండాలి

## - డాక్టర్ ఆనంద్ జాదవ్



తరంగాలు న్యూస్, మద్నూర్ నవంబర్ 20 : కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కార్మెల్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య చికిత్సల గురించి డాక్టర్ ఆనంద్ జాదవ్ అవగాహన కల్పించారు. ఔట్ పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్, ఎక్స్ రే తదితర వార్డుల కు వెళ్లి విద్యార్థులు వివరించారు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తప్పకుండా వైద్య సేవలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు హన్మంత్ రావ్, జావీద్ ఉన్నారు.

# రాబోయే ఎన్నికల్లో చేస్తున్న అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## - మండలం అధ్యక్షుడు దరాస్ వార్ సాయిలు



తరంగాలు, మద్నూర్ నవంబర్ 20 : మద్నూర్ మండలంలో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో, రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంత్ రావు చేపట్టిన అభివృద్ధి పనులను గ్రామాల్లో ప్రజలకు చేరవేయాలని కాంగ్రెస్ కార్యకర్తలను మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దరాస్ వార్ సాయిలు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల ప్రజలకు విస్తృతంగా లాభాలు అందుతు న్నాయని,ముఖ్యంగా మద్నూర్ మండలానికి అత్యధిక నిధులు మంజూరు అయ్యాయని,ఈ అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారాన్ని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధిష్ఠానం చెప్పినట్టు ఐకమత్యం పాటిస్తూ,సమన్వయ లోపం లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని,ప్రతి గ్రామం ప్రతి వార్డులో కాంగ్రెస్ నాయకులు అహర్నిశలు కృషి చేయాలని ఆయన సూచించారు.పార్టీ అభివృద్ధి కోసం అవసరమైతే,గ్రామాల్లో విస్తృత పర్యటనలు చేసి, కార్యకర్తలతో కలిసి పనిచేస్తామని దరాస్ వార్ సాయిలు హామీ ఇచ్చారు.జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అభివృద్ధి పరంగా తొంభై శాతం శ్రమ పెట్టి, మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు హనుమాన్ మందిర్ ఆలయ చైర్మన్ రామ్ పటేల్,సోసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్ హన్మంత్ యాదవ్, వి రమేష్ ,విట్టల్ గురుజి , మాజీ సొసైటీ చైర్మన్ కొండ గంగాధర్ ,సంతోష్ మేస్త్రి ,మండల కాంగ్రెస్ నాయకులు గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'ఐబొమ్మ' ఆగింది 'ఐబొమ్మ వన్' వచ్చింది!




తెలుగు సినీ ప్రియులకు సుపరిచితమైన పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మను పోలీసులు మూసివేయించిన కొన్ని రోజులకే, మరో కొత్త వెబ్‌సైట్ కలకలం రేపుతోంది. 'ఐబొమ్మ వన్' పేరుతో దాదాపు అవే ఫీచర్లతో కొత్త సైట్ ప్రత్యక్షమవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఐబొమ్మ నిర్వాహకుడు రవి అరెస్ట్ తర్వాత ఈ వ్యవహారం ముగిసిపోయిందనుకుంటున్న త-రుణంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. కొత్తగా ప్రారంభమైన 'ఐబొమ్మ వన్' వెబ్‌సైట్ చూడటానికి అచ్చం పాత ఐబొమ్మ లాగే ఉంది. అయితే, పాత సైట్‌లో కేవలం తెలుగు సినిమాలు మాత్రమే ఉండగా, కొత్త సైట్‌లో ఇతర భాషా చిత్రాలు కూడా అందుబాటులో ఉంచారు. దీని వెనుక రవి అనుచరులు ఉన్నారా? లేక మరెవరైనా ఉన్నారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ కొత్త వెబ్‌సైట్‌లో ఏదైనా సినిమాపై క్లిక్ చేస్తే, అది నేరుగా 'మూవీ రూల్జ్' అనే మరో పైరసీ సైట్‌కు రీడైరెక్ట్ అవుతున్నట్టు గుర్తించారు. ఐబొమ్మ ఎకోసిస్టమ్‌లో సుమారు 65 మిర్రర్ వెబ్‌సైట్లు ఉన్నాయని, వాటి ద్వారానే 'ఐబొమ్మ వన్'ను ప్రచారంలోకి తెచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూవీ రూల్జ్, తమిళ్ ఎంవీ వంటి సైట్లపైనా చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కాగా, ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసు దర్యాప్తులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అతడు తరచూ విదేశాలకు వెళ్లేవాడని... ఎవరినీ నమ్మకపోవడంతో ఇంట్లో పనివాళ్లను కూడా పెట్టుకోలేదని పోలీసులు గుర్తించారు.

# ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివెల్‌లో బాలకృష్ణకు అరుదైన గౌరవం



గోవా వేదికగా జరుగుతున్న 56వ ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివెల్ ఆఫ్ ఇండియా వేడుకలో ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణను సత్కరించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బాలకృష్ణకు ఈ అరుదైన గౌరవం లభించింది. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి మురుగన్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఆయనను శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈరోజు వైభవంగా ప్రారంభమైన ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివెల్ ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రారంభ వేడుకకు నటుడు అనుపమ్ ఖేర్ తదితరులు హాజరయ్యారు. ముగింపు వేడుకలో సూపర్ స్టార్ రజనీకాంత్‌ను సత్కరించనున్నారు. ఆయన కూడా నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.

# తన మార్ఫింగ్ చిత్రాలపై కీర్తి సురేశ్ తీవ్ర ఆవేదన

ప్రముఖ కథానాయిక కీర్తి సురేశ్ తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఏఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్ టెక్నాలజీతో సృష్టించిన ఈ నకిలీ ఫొటోలు తనను మానసికంగా ఎంతగానో బాధిస్తున్నాయని, విసుగు పుట్టిస్తున్నాయని సోషల్ మీడియా వేదికగా వాపోయారు. ఈ నకిలీ చిత్రాలు ఎంత సహజంగా ఉన్నాయంటే, వాటిని చూసినప్పుడు నిజంగానే తను అలా ఫోజు ఇచ్చానా? అని తనను తానే ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి తెలిపారు. ఏఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారుతోందో చెప్పడానికి ఇదే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఈ టెక్నాలజీ సామర్థ్యాలను నియంత్రించడం కష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా ఇతరుల చిత్రాలను ఇలా దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కీర్తి సురేశ్ అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకే పరిమితం కాదని, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఉపయోగించే ప్రతి ఒక్కరికీ ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. కీర్తి ఆవేదనకు నటి ఆండ్రియా జెరెమియా మద్దతు తెలిపారు. గతంలో రష్మిక మందన్న, సమంత వంటి నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ సమస్యను ఎదుర్కొన్నారు. ఈ ఘటన ఏఐ దుర్వినియోగంపై మరింత కఠినమైన చట్టాల అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తోంది.



# సమంత పాత్ర చాలా తేలికైంది – రాజ్ నిడిమోరు



దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. రాజ్–డీకే దర్శకత్వంలో వచ్చిన ఈ స్పై యాక్షన్ డ్రామా మూడో సీజన్ విడుదలకు సిద్ధమైంది. నవంబర్ 21 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్న నేపథ్యంలో ప్రమోషన్ల జోరు పెంచారు. ఇందులో భాగంగా దర్శకుడు రాజ్ నిడిమోరు ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి.

ఈ సిరీస్‌లో సమంత, నిమ్రత్ కౌర్‌ల నటన గురించి ఆయన మాట్లాడుతూ, "ఈ సిరీస్ కోసం మేము రాసిన పాత్రలు మొదట ఎవరినీ ఉద్దేశించి రాసినవి కావు. సమంత అయినా, నిమ్రత్ కౌర్ అయినా తమ పాత్రల్లో అద్భుతంగా ఒదిగిపోయారు. నిజానికి వారి పాత్రలు చేయడం చాలా తేలిక. అయినప్పటికీ వాళ్లు ఎంతో కష్టపడి ఆ పాత్రల్లో జీవించారు" అని పేర్కొన్నారు.

అదే సమయంలో, నటీనటుల విషయంలో తాను లింగ భేదాలు చూడనని స్పష్టం చేశారు. "పాత్రలో నటించేది పురుషుడా? మహిళా? అని నేను పట్టించుకోను. నా దృష్టిలో ఇద్దరూ సమానమే. స్క్రిప్ట్ ఏం డిమాండ్ చేస్తుందో దానినే నేను అనుసరిస్తాను" అని వివరించారు. అయితే, ఎంతో క్లిష్టమైన పాత్రలకు ప్రాణం పోసిన నటీమణుల గురించి మాట్లాడుతూ 'పాత్రలు తేలికైనవి' అని ఆయన చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు, అక్కినేని నాగచైతన్యకు విడాకులు ఇచ్చిన తర్వాత... రాజ్ నిడిమోరుతో రిలేషన్ లో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి.

# దేశంలో ఎవరిని కుక్క కరిచినా నన్నే తిడుతున్నారు - అక్కినేని అమల ఆవేదన

ప్రముఖ నటి, జంతు ప్రేమికురాలు అక్కినేని అమల తన మనసులోని ఆవేదనను బయటపెట్టారు. దేశంలో ఎక్కడ ఎవరిని వీధికుక్క కరిచినా, సోషల్ మీడియాలో చాలామంది తననే నిందిస్తూ దూషిస్తున్నారని ఆమె వాపోయారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తాను మొదటి నుంచి జంతువులను ప్రేమించే వ్యక్తినని, వాటిని హింసించవద్దని మాత్రమే చెబుతానని అమల తెలిపారు. కేవలం ఆ ఒక్క కారణంతోనే, వీధికుక్కల సమస్యకు తనలాంటి వారే కారణమంటూ కొందరు నిందిస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడ కుక్కల దాడి జరిగినా తన పేరును ట్రెండ్ చేస్తూ విమర్శలు చేయడం బాధ కలిగిస్తోందని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. గతంలో దేశవ్యాప్తంగా వీధికుక్కల దాడులపై పెద్ద ఎత్తున చర్చ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జంతు ప్రేమికులపై సోషల్ మీడియాలో తరచూ విమర్శలు వస్తుంటాయి. జంతువుల పట్ల ఎంతో సానుభూతితో వ్యవహరించే అమల, ఈ విషయంలో తనను అనవసరంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన కుటుంబ జీవితాన్ని, ఇతర పనులను బ్యాలెన్స్ చేసుకుంటూ బిజీగా గడుపుతున్న అమల, ఈ విషయంపై మాట్లాడినప్పుడు ఎమోషనల్ అయ్యారు.



Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com